# సప్త సముద్రాలు

కథా నిలయం
శ్రీకాకుళం

'వరిచేను కోత కొచ్చింది కమలా!"

పొద్దుతో పోటిపడి పంజేసి రాగానే కాళ్ళు కడుక్కుంటున్నాడు బాలయ్య. ఇంటి నిండా లైట్లు వెలుగుతున్నై. పొట్టనిండా గింజలతో నిండా ఒరిగిన వరికర్రలు కళ్ళల్లో కదిలాయి. తృప్తిగా నవ్వుకున్నాడు. ఆనందం అర్ణవమై చూపుల్లో చిలిపిదనం తొంగిచూసింది. పెళ్ళై పాతకేళ్ళైందన్న సంగతి గుర్తుకు రాలేదు. కమల అప్పుడే వికసించిన కమలం పూవులా కనపడింది.

'అటు వరిచేను కోత కొచ్చింది. ఇటు మన వనజ కాన్పుకొస్తుంది' భర్తకు తువ్వాలందిస్తూ తమాషాగా చూసింది కమల. 'సగమీదు కొచ్చినం. చాల్లే సంబడం' అంటున్నాయా చూపులు. ఎర్రని పెదాల మీద తెల్లని చిరునవ్వు తచ్చాడింది. విద్యుత్ కాంతిరేఖలు చిరునవ్వు మీద వాలి పరావర్తనం చెందినై. నీలంరాయి ముక్కుపుడక తళుక్కుమని బాలయ్య ఎదలో గిలిగింతలు పెట్టింది. మనసారా నవ్వుతూ వసారా లోకొచ్చాడు.

'ఇగో చాయ, వేడిగుంది.. జెల్డి దీస్కో నేను వంట జెయ్యాలె' కమల గాజుల చప్పుడు గమ్మత్తుగా విన్పించింది. చాయ గ్లాసు అందిస్తున్న చెయ్యి నలాగే పట్టుకోవాలన్పించింది. కాని.... చాయ ఒలికిపోతుంది. 'సిగ్గు లేదా?' అని కమల చీదరించుకుంటుంది. యాంత్రికంగా గ్లాసందుకుని కుర్చీలో కూలబడ్డాడు.

వేడి చాయ.. కమ్మగా ఉంది. కొండ దిగుతున్న కోడెనాగులా నరాల్లో ఉత్సాహం ఉరకలేసింది. మనసు కొడుకు వైపు మళ్లింది. రాజు ఏం జేస్తున్నడో.. పట్నం హాస్టల్లో పుస్తకం బట్టిండో లేక ఆటల మీదున్నడో. అప్పులైతే ఐనాయిగాని.. ఒక్కగానొక్క కొడుకు... వాడు గొప్పోడు కావాలె. ఎమ్మే పరీక్ష ఫీజు కట్టాలని ఉత్తరం రాసిండు గదా! ప్చ్.. పంట అమ్మితే గాని పైసలు రావు... వనజ కాన్పు కొస్తుందాయె! నా గుండెల మీదాడుకున్న చిట్టితల్లి... తల్లి.. కాబోతుంది. తాహతుకు మించిన కట్నమివ్వడం తప్పైపోయిందేమో. ఆ...తప్పేముంది. అబ్బాయికి గవర్నమెంటు ఉద్యోగముందాయె. తనకున్న మూడెకరాల్లో ఓ ఎకరం పోయింది. కట్నానికి సర్దుబాటయింది... పెళ్లి ఖర్చులకు బాపతులకు అప్పయింది. కాదామరి... ఆడపిల్ల పెళ్లంటే మాటలా, మజాకా...!

'అట్లా చూస్తున్నవేంది నాన్నా!" వనజ గొంతులాగుంది. అరెరే... వనజనే.. నా తల్లి వనజనే. విచ్చుకున్న ముఖారవిందము, మూడు రాళ్ళ ముక్కుపుడక, చెవులకు మకరకుందనాలు... అచ్చం అమ్మవారిలా ప్రత్యక్షమైంది. నిండు గర్భిణి కదా.. నిండుగా ఉంది. అయినా... ఈ రాత్రి వచ్చారేమిటో!

'నా తల్లే... ఎప్పుడొస్తివమ్మా?'

'బావున్నారా మావయ్యా?'

'ఓహో... అల్లుడు గూడా, అంతరంగము నిండా ఆనందతరంగాలు.

'ఆ... రా నాయనా...రా...అమ్మానాన్నలు బాగున్నారా?'

'బావున్నారు మావయ్యా. వనజమ లేడీ డాక్టరుకు చూపించిన. వారం రోజుల్లో కాన్పు రావచ్చుట. నేనేమో...నెల రోజుల ట్రైనింగ్ కోసం బెంగుళూరు వెల్తున్నా, ఇట్నుంచి ఇటే వెళ్లొచ్చని వనజను తీసుకొచ్చిన..." అల్లుని మాటల్లోని ఆత్మీయత ఆనందాన్ని పెంచేసింది.

మొదటి కాన్పు కోసం ఎలాగూ ఇటు రావల్సిందే గదా వనజ.

మర్నాడు అల్లుడు వెళ్లిపోయాడు. వనజలో ఉత్సాహం లేదు. మొహం వాడిపోయిన వంకాయలాగైంది. లోలోపల ఏదో బాధ ఉన్నటుంది. కన్నవారి మనసు కకావికలైంది. అప్యాయంగా ఒడిలో చేర్చుకుని కారణమడిగింది తల్లి.

వనజ కళ్లు మంచు పూరేకులైపోయినై. గుండె పొరల్లో గుడగుడలాడ్తున్న ఆవేదన గొంతులో కొచ్చింది. 'కట్నం పైసలు పూర్తిగా ముట్టలేదట గదా! మా అత్త చిర్రుబుర్రులాడ్తుంది. సర్కారు నౌకరున్న కొడుక్కు చాలీచాలని కట్నమని దెప్పి పొడుస్తుంది. 'నాల్రోజులైతే నా కొడుకు తండ్రి గావట్టెగాని ఇంకా మిగిలిన కట్నం పైసలు దిక్కులేవాయె'నని సూటిపోటి మాటల్తోని చుట్టాల ముందు మూతులు తిప్పుతుంది. మీరెవలన్నా వచ్చి కాన్పుకు తీసుకెల్తారంటే ఒప్పుకోలేదు. ఆయనతోనే నన్ను పంపించిం దమ్మా!" కళ్లు చిప్పిల్లినై. కన్నకూతురు కంటిధారలు కడుపులో కలకలం రేపినై.

"ఏమయ్యా... విన్నవా?' కొంగుతో కళ్లద్దుకుంది కమల.

ఆకుచాటు పిందెలా పెరిగిన వనజ ఏనాడు, ఎవరితోనూ మాటలు పడలేదు. నా తల్లికి అత్తింటి ఆరడి షురువైందా...!

'విన్నాను కమలా!" బాలయ్య గొంతులో పచ్చి వెలక్కాయ చిక్కినట్టుంది. 'నిజమే గదా! మిగతా ఇరవై వేలు ఇవ్వకనే పోతిమి'

'మరెట్లనయ్యా!?'

'ఇగో... వరి కోస్తున్నం గదా! పంట అమ్మితే ముప్పైవేలు రావచ్చు. కట్నం బాకీ ఇచ్చేద్దాం. మిగతావి ప్రసూతి ఖర్చులూ, చిల్లెర బాకీలకు సరిపోవచ్చు. అప్పుదేరి అంగట్లుండొచ్చు...'

ఆ మాటలు సాంత్వన వచనాలై తల్లీకూతుళ్ల కళ్లల్లో వెలుతురు పూలు పూయించినై.

పంటకోతల సీజన్. కూలీలు దొరకడం కష్టంగా ఉంది. పల్లెల గుండె చప్పుళ్లను మార్చేసిన అజ్ఞాతవాసుల అండ రైతులకూలీల హక్కుల్ని గుర్తు చేసింది. దాంతో సన్నకారు రైతుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలాగైంది.

రైతు కూలీలు.. పది గంటలకు పనిలోకొచ్చి ఐదు గంటలకు దిగిపోతారు. మధ్య అరగంట విశ్రాంతి. వచ్చేముందు ఆలస్యమనేది ఆనవాయితీగా మారింది. కోతలకు నాలుగైదు రోజుల ముందు నుండే కూలీలను పలుకరిస్తుండాలి. మాట పొల్లుబోయినా, కూలీ డబ్బుల్లో ఏ మాత్రం తేడా వచ్చినా ఇల్లు పీకి పందిరేస్తారు. కూలీ ఎక్కువిస్తే పెద్ద మోతుబరి రైతులతో తంటా, తక్కువిస్తే కూలీలతో గొడవ, మరోసారి కూలీలు దొరకరు. కాళ్ళూ చేతులు కొట్టుకు చావాలి.

కాకులు కావుకావు మనకముందే నిద్రలేచి కాలికి బలపం కట్టుకుని కూలీల ఇంటి తలుపులు తట్టాడు. అమ్మా, తల్లీ, అయ్యా అంటూ గుండె తలుపులు తట్టాడు. భగీరథ ప్రయత్నం ఫలించింది.

మొదటి రోజు కోసి కుప్పబెట్టడమైంది. మరోరోజు కల్లం. కుప్ప గొట్టి, గడ్డి తొక్కించి, ధాన్యం బస్తాలు బండ్ల కెక్కించారు. ధాన్యం బస్తాలు ఇంట్లో కొస్తుంటే లక్ష్మీదేవి నవ్వుతూ వచ్చి నడి ఇంట్లో కూచున్నట్టనిపించింది. అలసి సొలసి నిద్రాదేవి కౌగిట్లో ఒరిగిపోయారంతా, ఇదంతా పాత అనుభవమే.

తూరుపు వాకిలి తెల్లబారలేదింకా.

'బాలయ్యా... బాలయ్యా!" తలుపు మీద టకటకలు.

కళ్లు నులుముకుంటూ లేచొచ్చి తలుపులు తెరిచాడు బాలయ్య. మసక చీకటి తెరల్లో మలహరిసేటు... మత్తు చిత్తు.

'రా సేటూ...రా..." ఆహ్వానం. ఇంటి ముందు చేపచెట్టు గాలిలా చల్లగా తాకింది. ఒళ్లు జలదరించింది.

'ఈసారి పంట బాగానే పండినట్టుంది' బస్తాలను కళ్లతో తడుముతూ కుర్చీలో కూర్చున్నాడు మలహరి.

'అవును... మీ దయవల్ల....'

"మనదేముంది బాలయ్యా!" పెదాల మీద చిరునవ్వు. 'రెక్కలు ముక్కలు చేసుకుని రాత్రింబగళ్లు కష్టపడింది నువ్వు. కష్టే... ఫలే... అన్నారు గదా.' మాటలు గుండెలోతుల్ని తడుతున్నాయి.

'అయినా... ఎరువులకూ, కలుపు కూలీలకూ నువ్వే అప్పిస్తివి'

మలయ మారుతం సోకినట్టనిపించింది మలహరికి.

'అమ్మాయి కొన్పు కొచ్చిదట గదా! మొదటి కాన్పు. చాల జాగ్రత్తగా ఉండాలె సుమా!'

బాలయ్యకు బ్రహ్మానందంగా ఉంది 'అవునయ్యా....'

'సరేగాని... ధాన్యం ఎప్పుడు తీసుకెళ్లాలె?' మలహరి మందహాసం

ఓహో... అందుకా వచ్చింది! ముసుగులో గుత్తులాట ముందు ముందు కష్టాలకు హేతువవతుంది.

'నీకెందుకా శ్రమా? నేనే పట్నం దీస్కపోయ్యి అమ్ముకొస్తా.'

'లారీ దీసుకొచ్చి కాంటావెట్టి తీస్కపోతా, శ్రమ లేకుండా లాభమొస్తుందా? అదంతా నాకలవాటే గదా! గా పట్నం మార్కెట్ పరేషాన్ నీకెందుకూ?'

వీని దుంపదెగా! వదిలేట్టు లేడు గదా! మొహమాటానికి సరే నంటే ధర విపరీతంగా బేరమాడ్తడు. క్వింటాల్ కింత తరుగని తీసేస్తడు. అసలాయన వృత్తే అది గదా! అయినా.... నాకు చదువు రాదా! జెరంత కష్టపడితే ఆ లాభమేదో నాకే వస్తది. సప్త సముద్రాలీదినా సరే... మార్కెట్కెల్తా.

'ఉహు! ఈసారి నేనే స్వయంగా అమ్ముకొచ్చుకుంటా!"

దుర్వార్త విన్నట్లు... క్షణంలో మలహరి మొహం మాడిపోయిన రొట్టె పెంకులాగైంది. 'ఈసారి కొత్తగా మాట్లాడ్తున్నావ్ బాలయ్య'

'కాలం ఎప్పుడూ ఒకే రకంగా ఉండదు గదా!'

'స...రే ! నీ ధాన్యం... నీ ఇష్టం...' నీ, ఒత్తిపలుకుతూ సరసరా వెళ్లిపోయాడు. పీడా వదిలింది.

హమ్మయ్య...! సప్త సముద్రాల్లో మొదటి సముద్రాన్నీదగలిగాడు. తృప్తిగా ఓ నిట్టూర్పు వెలువడింది. అదే విధంగా అద్దె ట్రాక్టర్ సంపాదన, బస్తాలు పట్నం తేవడం, కమీషన్ ఏజంటుతో మాట్లాడ్డం నాలుగు సముద్రాలను ఈదేశాడు.

గంజ్ ఆవరణ చాలా పెద్దది. షెడ్ల నిండా ధాన్యం రాశులతో కళకళలాడుతోంది. ఖాళీ షెడ్డు ఒక్కటి గూడా లేదు. లారీలు, ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు.. ఖాళీ చేస్తూ గచ్చునేల మీద దాన్యాన్ని రాశులుగా పోస్తున్నారు. బాలయ్య ట్రాక్టర్నో పక్కకు తీసుకెళ్లారు హమాలీలు. బస్తాలు కుమ్మరించి నేల మీద పోస్తున్నారు.

'బస్తాలల్ల దాన్యమిట్లనే ఉంటే ఏమైతది?' అడిగాడో హమాలీని.

'బస్తాలల్ల ఉంటే కల్తీ సంగతి దెల్వది. వడల్ల పొల్లు, పెల్ల ఎంత ఉందో పరీక్ష జెయ్యాలె గదా! కొన్నోళ్లు వాళ్ల బస్తాలు నింపుకపోతరు.'

"ఒహో! అట్లనా! వాళ్లే బస్తాలు నింపి కాంటా కెక్కిస్తరన్నమాటా!"

దాన్యం ఖాళీ చేసి ట్రాక్టర్ వెళ్లిపోయింది. ధాన్యం రాశి బంగారు పర్వతంలా కన్పించింది. ఎదలో ఆనందం పెదాలను కదిలించింది.

చాలా సేపైంది. కడుపులో కలకలం బయలుదేరింది. అప్పుడు గుర్తొచ్చింది... పొద్దట్నుంచీ తానేమీ తినలేదని.

గంజె నిండా ధాన్యం రాశులున్నాయి. రాశుల వద్ద మనుషులున్నారు. ఓవైపు కాపలాదార్ల కళ్లు గప్పి పందులు పరుగెత్తుకొస్తున్నై. నోటికందిన ధాన్యం వాటి కడుపుల్లో కెళ్లిపోతోంది.

అమ్మో! జాగ్రత్తగా సూడాలె. కంటికి రెప్పలా కాపాడాలె. మరి.... ఆకలి! ఏం జెయ్యాలె? ఎట్లా? మిట్టమధ్యాహ్నామైపోయింది.

కొనుగోలుదార్లు వచ్చేశారు. ఖరీదైన డ్రెస్సులూ, వేళ్లకు ఉంగరాలు, చేతులకు బ్రాసులెట్లు... లక్ష్మీ పుత్రుల్లాగున్నారు. రాశి చుట్టూ మూగి క్వింటాల్ కింత అని వేలం పాట పాడి కొంటున్నారు. ఒక్కో రాశి వద్ద ఐదారు నిమిషాలవుతోంది. ఇంకా చాలా రాశులున్నాయి.

సూర్యుడు నడినెత్తి మీదాడుతున్నాడు. బాలయ్య మొహం వెలవెలబోతోంది. కొనుగోలుదార్లు జోకులు కట్ చేసుకుంటూ, పరాచకాలాడుతూ తన రాశి వద్ద కొచ్చారు. దడువాయి నారాయణ వడ్లగింజల్ని దోసిలితో తీసి చూపిస్తున్నాడు. కొనుగోలు దార్లు తలా పిడికెడందుకుని అరచేతుల్లో నలిచి, పైకెగరేసి పరిక్షిస్తున్నారు.

'నూకలెక్కువ, బియ్యం తక్కువ'

'నూకలు గూడా పరంపరం....'

పెదవి విరుస్తూ, నవ్వులు రువ్వుకుంటూ సైగలు చేసుకుంటున్నారు.

'వడ్లల్ల మట్టిపెల్లలు బాగున్నై' దోసిలి నిండా గింజలెత్తి రాశిలో పోస్తూ నిరాశ వెలిబుచ్చాడొకాయన.

'మా బాలయ్య సన్నకారు రైతు. చాలా కష్టపడ్డడు. సొంత రెక్కల కష్టంతోని పండిస్తడు...' అనేసి నారాయణ పాటందుకున్నాడు.

ఐతే...ఐదో సముద్రాన్ని దాటేస్తున్నానన్నమాట...

మామూలు ధర కంటే క్వింటాల్‌కు పాతిక రూపాయలు తక్కువతో పాట ముగిసింది. కొనుగోలుదార్లు మరో రాశి వద్ద కెల్తున్నారు.

బాలయ్య గుండె గుబగుబలాడింది. భుజమ్మీది తువ్వాలుతో చెమట అద్దుకుని 'ధర గిట్లయిందేంది నారాయణన్నా?' అడిగాడు.

'మరెట్లనుకున్నవ్ బాలయ్యా! ఇంకా నయం. అసలే వద్దని రిజెక్ట్ చెయ్యలేదు, నీకిష్టం లేకుంటే అప్పుడే చెప్పెయ్యాలె ఈ ధర కివ్వనని. సరే.... బీటు (కొనుగొలు) అయింతర్వాత వాళ్ల మనుషులొచ్చి బస్తాలు నింపుకుని కాంటావెట్టుక పోతరు. దగ్గరుండి చూస్కో. అప్పటిదాకా జాగ్రత్తగా కావలి గాయాలె' బలవంతంగా నవ్వేసి వాళ్ల వెంట వెళ్లాడు.

ఇదేందీ... మాయాబజార్ లెక్కుంది. ధాన్యం బస్తాలల్ల నింపి కాంటాకెక్కాలె, పైసలు చేతుల పడాలె. అంటే... ఇంకా రెండు సముద్రాలీదాలె. ఈ సముద్రాలీదుడు కష్టంగా ఉంది. గొణుక్కున్నాడు.

ఆకలితో పేగులు నకనకలాడ్తున్నె. బజారుకెళ్లి హోటల్ల భోంచేసొస్తే... అబ్బో! రాశి నెవడు చూడాలె? ఓ దిక్కు పందులు, ఇంకోదిక్కు దొంగలు. రక్తాన్ని చెమటగా మార్చి పండించిన ధాన్యం గదా! కొద్దిసేపైతే కాంటాకెక్కిస్తరు. ఆ తర్వాత తృప్తిగా తినొచ్చు.

"ఏం బాలయ్యా.. వడ్లు దెచ్చినవు గదా, ఖేష్ బీటు ఐపోయిందా?" మలహరి సేటు.. ఎక్కడి నుండి ఊడి పడ్డాడో! అరబ్ దేశాల్లో తెలుగు మాట వినబడినట్టు.. సంతోషం.

"ఆఆ.... బీటు ఐపోయింది. ఇంక కాంటాకెక్కాలె...." సమాధానం పూర్తిగా వినకుండానే "నేను గూడా దెచ్చిన" అంటూ వెళ్లిపోయాడు.

కొనుగోలుదార్ల మనుషులు రాశుల వద్దకొచ్చి ధాన్యం బస్తాల్లో నింపి కాంటా వెయ్యటం ప్రారభించారు. పందులను తరుముతూ పరికించి చూస్తున్నాడు బాలయ్య. సాయంత్రం నాలుగైంది. ఇంకొద్ది సేపట్లో కాంటా ఐపోతుంది. డబ్బు తీసుకొని వెళ్లిపోవచ్చు.

అదో... ఆ రాశి వద్ద మలహరి సేటు... అతని ధాన్యం బస్తాల్లో నింపుతున్నారు. కాంటా వేస్తున్నారు. పక్కన దడువాయి నారాయణ.

అదెట్లా! నేను అతని కంటే ముందే గంజిలకొచ్చిన గదా! ఫ్చ్! పలుకుబడి గలవాడు. అయినా... కొంచెం వెనకా ముందు, నా రాశిదాకా వస్తారు గదా!

కాంటాదార్లు ఎవరెటు లాక్కెల్తే అటు వెల్తున్నారు.

కాబోయే మొగుణ్ని మొదటిసారి చూస్తున్న ముగ్ధలా సూర్యుడు మబ్బుల మాటున దాక్కున్నాడు. ఆకాశం నిండా మోఘాలు కమ్ముకున్నె. ఐదు నిమిషాల్లో చీకట్లు కమ్ముకున్నె వీధి దీపాలు వెలిగినై. ఎవరో వచ్చి కాంటాదార్లను లాక్కెల్తున్నారు.

ఈ సముద్రాన్నీదడం చాలా కష్టమయేట్టుంది.

"ఏయ్...ఏయ్... ముందు నా వడ్లు కాంటా వెట్టుండ్రి. అటెన్క" అటు పోవాలె... బాలయ్య అరుపు గాలి దుమారంలో కలిసిపోయింది. రాశులన్నీ ఖాళీ అయిపోతున్నై. అన్నీ ఐపోయినై. ఒక్కటే.... బాలయ్య రాశి ఒక్కటే మిగిలింది.

చిటపట చినకులు.. గచ్చకాయల్లాంటి చినుకులు... గుండెలు దడదడలాడినై. జనారణ్యంలో బాలయ్య తప్పిపోయాడు.

"అయ్యో! నా రాశి. జల్దీ రాండ్రి. కాంటా పెట్టండ్రి" అటూ ఇటూ చూస్తు తువ్వాలురాశి మీదేశాడు.

"జర్రాగువయ్యా... చినుకులు తగ్గిపోనీ" హమాలీ మేస్త్రీ పరుగులు. వాన జోరందుకుంది. అది వడగళ్లవాన. కాంటాదార్లు మాయమైపోయారు. చల్లనిగాలి... మంచు తెరల్ని మరిపిస్తోంది.

అబ్బో వాన చినుకులు... చినుకులు కావవి ఆకాశం కుమ్మరిస్తున్న గులకరాళ్లు. కరెంటు పోయింది. వీధి లైట్లారిపోయినై. చినుకులు ఇసిరిసిరి కొడుతున్నై ఎట్లా.... ఇప్పుడెట్లా ధాన్యం తడిసిపోతోంది. సముద్రం నడుమ సుడిగుండంలో చిక్కుకున్నట్టైంది. బుర్రలో బాంబులు పేలిపోతున్నై.

చీకటి... చిమ్మ చీకటి... ఉరుములతో మెరుపులు.... వరద... వరద అటువైపే వస్తోంది అరెరే.... రెక్కల కష్టం... నీళ్లపాలై కొట్టుకుపోతే ఎట్లా?... ఏడుపొస్తోంది.

"అమ్మో.... నా వడ్లు.... నా వడ్లు" లబలబ లాడ్తున్నాడు. ఒంటిమీది షర్టు విప్పి కుప్పమీద కప్పేశాడు. లాభం లేదు. వాన జోరు.. ఉరుముల గర్జన... మెరుపుల తీరు... వరద.. పెద్ద వరద... బ్రహ్మరాక్షసి ఉరికొస్తుంది.

"నా ధాన్యం పోతే నా పని తున్నా....!" వణుకుసున్నాడు. చేతులు పిసుక్కుంటు న్నాడు. పరేశాన్...పరేశాన్.. ఒంటిమీది ధోవతి గబుక్కున విడివడి రాశిమీద కప్పుకుంది. వరద తాకిడి రాశిని కదిలించింది. రాశి మొత్తం కదుల్తోంది.

"అరె నీ యవ్వ... గా వరద గూడ రాశికిందకే రావాల్నా!" అరణ్య రోదనం.

ధాన్యం కొట్టుకుపోతోంది. వానకు గాలి తోడు.

తువ్వాలు, షర్టు, ధోవతి...ఏవీ... ఎక్కడా? రాశి తరిగిపోతోంది. అయోమయం, అగాధం, అంగలార్పులు... నగ్నంగా... కేకలు.... "అయ్యో... ఎవలన్నా లేరా.. లేరా....!' కేకల్ని ఉరుములు మింగేస్తున్నై. రాశి మీద పొరుదండాలు... రోదనం. అరణ్యం రోదనం వాతావరణం చల్లగా... మంచుకొండ మీదున్నట్టుంది.

షెడ్లల్లో ముడుచుకున్న వాళ్లకంతా వినబడుతోంది. మెరుపుల్లో కొంత కనబడుతోంది. కాని ఏం లాభం? కుండపోత వర్షం. "నువ్వెట్లావయ్యా..." మందలిస్తున్నారు.

"నే్నానను... నే్నానను...., నా వడ్లు..." మిగిలిన రాశిమీద బోర్లా, వెల్లకిలా... అటూ, ఇటూ... ఆర్తనాదాలు..

అరగంటలో ధాన్యమంతా కొట్టుకుపోయింది. బాలయ్య వంటిమీద నూలు పోగు లేదు. మొత్తుకుంటున్నాడు... గంతులేస్తున్నాడు... నగ్న శివతాండవం... దిగంబర నటరాజనృత్యం... పేరిణి శివతాండవం

"నా వద్దు.. నావద్దు..." చుట్టూరా నీళ్లు... బాలయ్య గొంతు ఎండుకుపోతోంది. నేలమీద బొర్లుతున్నాడు.

వర్షం తగ్గింది. కరెంటు వచ్చింది. దీపాలు వెలిగినై. షెడ్లలో మనుషులు. వెన్నుపూసల్లో వణుకు.

బాలయ్య వణుకుతున్నాడు. ఏడుస్తున్నాడు. నవ్వుతున్నాడు. నవ్వుతూ ఏడుస్తున్నాడు. ఏడుస్తూ నవ్వుతున్నాడు. వెర్రిగా గంతులేస్తున్నాడు. తుంపర పడ్తూనే ఉంది.

వీధిలైట్లు వింతగా చూస్తున్నై. పరిసరాలు పల్లెత్తు గూడా స్పందించడంలేదు. మనుషులు తమాషా చూస్తున్నారు. చిఛీ.. వీళ్లంతా మనుషులేనా?... ఎవరి ప్రాణం వారికి తీపిగదా?

సప్తమ సముద్రం చేరకముందే సర్వస్వం హరించుకుపోయిందా?... కాదు...

అప్పుడు గుర్తుకొచ్చింది...

నాకింకా రెండెకరాలున్నై. ఒకటి అమ్మేసినా ఇంకొకటి మిగుల్తుంది... దాంతోనే సాధిస్తా.....

'అదివారం ఆంధ్రభూమి'
19 మే, 2002

